క్లుప్తంగా

యువత క్రీడల్లో రాణించాలి

గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ చంద్రశేఖర్



క్రీడాకారులకు టీషర్టులను అందజేస్తున్న చంద్రశేఖర్

షాద్‌నగర్: యువత క్రీడల్లో రాణించాలని గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని విఠ్యాల గ్రామంలో వీపీఎల్ క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసికోల్లాసాన్ని పెంచుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరు తమకు నచ్చిన ఆటలను ఆడి.. సత్తా చాటుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు టీషర్టులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హన్యానాయక్, రాములు, వీఓఏ మొయినొద్దీన్, రాఘవేందర్‌గౌడ్, ప్రశాంత్, రతన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా అభివృద్ధి చేయండి: ఎంపీపీ



మాట్లాడుతున్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

కొత్తూరు: జీపీల అభివృద్ధి కోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమీక్షలో ఎంపీపీ, అధికారులు మాట్లాడుతూ.. సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల మండలస్థాయి అధికారులకు జీపీలకు వచ్చే నిధులు, సమస్యలు.. వాటి ప్రాధాన్యతను బట్టి పరిష్కారాలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలన్నారు. ముఖ్యంగా పంచాయతీలకు మంజూరయ్యే నిధులను వినియోగించడంతో పాటు చేపట్టే అభివృద్ధి పనుల్లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. లేని పక్షంలో నిధులు వృథా అయ్యే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శరత్‌చంద్రబాబు, తహసీల్దార్ రాములు, ఎంపీఓ నర్సింహులు, ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

నందిగామ: నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ ఒకవరం లాంటిదని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మండల కేంద్రం నందిగామ గ్రామ పంచాయతీ అనుబంధగ్రామం పిట్టలగూడకు చెందిన సునీతకు మంజూరైన రూ.2 లక్షల 50 వేల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే ఆయన నివాసంలో శుక్రవారం అందజేసి మాట్లాడారు. సునీత అనారోగ్యానికి గురై హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందడంతో ఆమెను ఆదుకునేందుకు సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నారని, దీంతో ఆమెకు మంజూరైన ఎల్‌ఓసీని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, సునీత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై అవగాహన

కందుకూరు: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై మండల పరిషత్ సమావేశపు హాల్‌లో ఎంపీపీ మంద జ్యోతిపాండు ఆధ్వర్యంలో ఎంపీడీఓ వెంకట్రాములు శుక్రవారం ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ స్థాయిలో 29 శాఖలకు సంబంధించిన సమాచారం మొత్తం సేకరించి 2023–24 సంవత్సరం ప్రణాళికను తయారు చేయాలన్నారు. వాటి వివరాలను ప్రభుత్వ యాప్‌లో పొందుపర్చాలన్నారు. గ్రామాల అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. ఎంపీఓ విజయలక్ష్మి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కళాశాల కల నెరవేరేనా?

- పది చదివినా ప్రయోజనం శూన్యం
- దూరప్రాంతం వెళ్లలేని విద్యార్థినులు
- కార్పొరేట్ కాలేజీల ఫీజులు కట్టలేక చదువుకు స్వస్తి
- భారంగా మారిన ఉన్నత చదువులు
- సర్కారు విద్యాలయం కోసం ఎదురుచూపు

మొయినాబాద్ రూరల్: పేద విద్యార్థుల ఉన్నత చదువులు కలగానే మిగులుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. మండలానికి ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయంలో నేతలు హామీలిచ్చి.. గాలికి వదిలేశారని ఆరోపిస్తున్నారు. మండలంలో ఏటా సుమారు రెండు వేల మంది విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణులవుతున్నారు. ఇంటర్ విద్య చదవాలంటే హైదరాబాద్, చేవెళ్లకు వెళ్లాల్సి వస్తుందని, దీంతో పేద విద్యార్థులు పై చదువులకు స్వస్తి చెబుతున్నారని మండల వాసులు వాపోతున్నారు.

కళాశాల ఏర్పాటు చేయాలి

మండలంలో 14 ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలలో ఏటా వేలాది మంది విద్యార్థులు పది పాసవుతున్నారు. ఇంటర్ చదవాలంటే అందుబాటులో ప్రభుత్వ కళాశాల లేక.. ప్రైవేట్‌లో చేరాల్సిందే. లేదంటే నగరానికో, చేవెళ్లకో వెళ్లాల్సి ఉంటుంది. అదీ కుదరకపోతే చదువు మానుకోవాల్సిందే. 2014లో ఎన్నికల సమయంలో నాయకులు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో విద్యార్థులకు దూర ప్రయాణం తప్పడం లేదు. మండలంలో జాతీయ స్థాయిలో కళాశాలలు, ఇంజినీరింగ్, మెడికల్, ప్రైవేట్ కళాశాలలు ఉన్నా.. వీటి వలన పేద విద్యార్థులకు ఏమాత్రం ఉపయోగం లేదని పది చదివిన, చదువుతున్న విద్యార్థులు వాపోతున్నారు. స్థానికంగా ప్రభుత్వ పాఠశాలతో పాటు ఇంటర్ కళాశాలను ఏర్పాటు చేయాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఉన్నత చదువులకు నగరానికి వెళ్తున్న విద్యార్థులు



అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు

దూర ప్రాంతాలకు వెళ్లాలంటే..



వచ్చే విద్యా సంవత్సరానికి మండల పరిధిలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషిచేయాలి. ప్రస్తుతం 10వ తరగతి అజీజ్‌నగర్ పాఠశాలలో చదువుతున్నా. మండలంలో ఎంతో మంది బాలికలు పది చదువుతున్నప్పటికీ.. దూర ప్రాంతాలకు వెళ్లాలంటే కొంత ఇబ్బందికరంగా ఉంటుంది. మండలంలో కళాశాల ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– చరిత, విద్యార్థిని, అజీజ్‌నగర్

మానవత్వం చూపాలి



పేద విద్యార్థులు పది పూర్తి చేసుకొని ప్రైవేట్ కళాశాలకు వెళ్లాలంటే అధిక ఫీజులు చెల్లించలేకపోతున్నారు. తల్లిదండ్రులు వ్యవసాయం, కూలీ పనులు చేస్తూ పై చదువులకు పంపాలంటే ఆర్థికంగా ఇబ్బందికరమే. ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేస్తే.. వసతులతో పాటు నాణ్యమైన విద్య లభిస్తుంది. పేద విద్యార్థుల పట్ల ప్రభుత్వం మానవత్వం చూపాలి.

– సులేఖ, పదో తరగతి విద్యార్థిని, అజీజ్‌నగర్

ఉచిత బియ్యం కేంద్రానివే

కొందుర్గు: రేషన్ షాపుల ద్వారా ప్రస్తుతం లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేస్తున్న 5 కిలోల బియ్యం కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్నవేనని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా ఏమీ లేదని బీజేపీ జిల్లేడ్ చౌదరిగూడ మండల అధ్యక్షుడు కుర్మయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు కల్యాణ మహోత్సవం



వేంకటేశ్వర ఆలయంలో కొలువుదీరిన గోదాదేవి

మొయినాబాద్ రూరల్: కనకమామిడి వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో శనివారం గోదాదేవి, రంగనాథ స్వామిల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నామని ఆలయ చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి, నిర్వాహకులు బుచ్చిరెడ్డి తెలిపారు. కల్యాణం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని, ఈ మహోత్సవాన్ని వేదపండితులు, ఆలయ పూజారులు నిర్వహిస్తారని చెప్పారు. విచ్చేసిన భక్తులకు గోదాదేవి, రంగనాథ స్వామి దర్శనంతో పాటు శ్రీనివాసుడి దర్శనం అనంతరం, తీర్థప్రసాదాలు, అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించబడుతుందని పేర్కొన్నారు.

విధినిర్వహణలో నిర్లక్ష్యం తగదు

- కంటి వెలుగు శిక్షణ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి

షాద్‌నగర్: విధినిర్వహణలో వైద్యసిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి హెచ్చరించారు. శుక్రవారం తన కార్యాలయంలో డివిజన్‌లోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, కంటి వెలుగు బృందాలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. షాద్‌నగర్‌లో కంటి వెలుగు కార్యక్రమానికి 10 బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి బృందంలో ఆప్తాల్మిక్ ఆఫీసర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్త్ సూపర్ వైజర్లు, ఇద్దరు ఏఎన్‌ఎంలు, ముగ్గురు ఆశవర్కర్లు ఉంటారని తెలిపారు. గ్రామాల్లో నిర్వహించే శిబిరాల్లో ఐదు టేబుళ్లను ఏర్పాటు చేయాలని, ఆరోగ్య సిబ్బంది తమకు అప్పగించిన విధులను నిర్వహించాలని సూచించారు.

రోజుకు 300 మందికి పరీక్షలు

కంటి వెలుగులో రోజుకు 300 మందికి కంటి పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందని, 18 ఏళ్లు నిండిన వారందరూ కంటి పరీక్షలు చేయించుకోవచ్చని సూచించారు. కంటి పరీక్షలు నిర్వహించిన తర్వాత అవసరమైన వారికి కంటి అద్దాలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కంటి సమస్యలు తీవ్రంగా ఉంటే కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు రెఫర్ చేయాలని సూచించారు. ఈనెల 18న ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో నిర్వహించే శిబిరాలకు విధిగా ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, పీహెచ్‌సీ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జయలక్ష్మి

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

కొత్తూరు: క్రీడల్లో రాణిస్తే యువకులు, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎల్లారం శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నిర్వహించిన వాలీబాల్ టోర్నీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. యువత, విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో మరింత నైపుణ్యం సాధించి రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో రాజేందర్‌నాయక్, పాష, రవీందర్‌రెడ్డి, రెడ్యానాయక్, మహేందర్‌రెడ్డి, మల్లేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



టోర్నీని ప్రారంభిస్తున్న శేఖర్‌రెడ్డి

కంటి వెలుగును విజయవంతం చేద్దాం

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్

చేవెళ్ల: కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యారోగ్య అధికారులకు, సిబ్బందికి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ సూచించారు. మండలకేంద్రంలోని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శుక్రవారం డివిజన్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, కంటి వెలుగు మెడికల్ అధికారులు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, అప్తమాలిక్ అధికారులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లతో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడారు. ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమానికి వైద్యసిబ్బంది సిద్ధంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, డ్వాక్రా సంఘాల సభ్యులు, గ్రామంలోని నాయకులు, తదితరులందరినీ ఆహ్వానించాలని చెప్పారు. సమావేశంలో సీహెచ్‌ఓ గోపాల్‌రెడ్డి, హెచ్‌ఈ సుదర్శన్, ఆప్తాల్మిక్ అధికారి రమేశ్, డివిజన్‌లో అన్ని పీహెచ్‌సీల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, డీఈఓలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



చేవెళ్ల: సమీక్షలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్

షాబాద్‌లో..

షాబాద్: కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. 18 నుంచి ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమంపై వైద్యాధికారి శ్రీనివాస్ తదితరులతో జెడ్పీటీసీ చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది గోపాల్, సువర్ణ, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు చల్లా శ్రీరాంరెడ్డి, రాందేవ్‌యాదవ్, బల్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు న్యాయం చేస్తాం

- పరిశ్రమల రాకతో అభివృద్ధి చెందుతున్న మండలం
- ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి



రైతులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి

షాబాద్: పరిశ్రమల ఏర్పాటుతో మండలం మరింత అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కుమ్మరిగూడలో సర్వే నంబర్ 311లో గల ప్రభుత్వ భూమిలో హెచ్‌ఎండీఏ వెంచర్ ఏర్పాటు కోసం ప్రభుత్వం ఇటీవల రైతుల నుంచి భూ సేకరణ చేపట్టింది. భూములు ఇచ్చిన రైతులకు ఎకరాకు 750 గజాల స్థలం ఇచ్చేందుకు నిర్ణయించారు. చేవెళ్ల ఆర్డీఓ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే, జెడ్పీటీసీ ఆధ్వర్యంలో మొదటగా 15 మంది రైతులకు పట్టా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలతో నియోజకవర్గం రూపురేఖలు మారిపోనున్నట్లు చెప్పారు. ఇప్పటికే చందనవెల్లిలో ఏర్పాటు చేసిన వెల్‌స్పన్ కంపెనీ, అమెజాన్, సీతారాంపూర్‌లో ఏర్పాటవుతున్న విద్యుత్ కార్ల తయారీ కంపెనీతో పాటు షాబాద్‌లో ఏర్పాటు చేయనున్న హెచ్‌ఎండీఏ వెంచర్‌తో ఈ ప్రాంతం ఊహించని రీతిలో అభివృద్ధి చెందుతుందని చెప్పారు. భూములు కోల్పోయిన రైతులందరికీ న్యాయం జరిగేలా తమవంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి, చేవెళ్ల ఆర్డీఓ వేణుమాధవ్‌రావు, షాబాద్ తహసీల్దార్ సైదులుగౌడ్, ఆర్‌ఐ నర్సింగ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్‌లు తమ్మలి సుబ్రమణ్యేశ్వరి, కేతన, దర్శన్, నాయకులు రమేష్‌యాదవ్, రవీందర్, నర్సింహులు, అధికారులు, సిబ్బంది, రైతులు తదితరులున్నారు.

అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి

ఎంపీపీ పోతురాజు

కొందుర్గు: గ్రామపంచాయతీ అభివృద్ధి పనుల విషయమై 2023–24 సంవత్సరానికి ప్రణాళిక తయారీపై ఎంపీపీ పోతురాజు అధ్యక్షతన శుక్రవారం మండలపరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతి కార్యదర్శులకు అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆంజనేయులు మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న వనరులను ఉపయోగించుకొని వచ్చే ఏడాది గ్రామంలో అభివృద్ధి చేపట్టేందుకు ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. ఇందులో భాగంగా గ్రామంలోని ఆర్థిక వనరులతోపాటు జీపీ ఆధ్వర్యంలో పనిచేసే 29 ప్రభుత్వ శాఖల ద్వారా తమ గ్రామాలకు లభించే అభివృద్ధి నిధులను అనుసందానం చేయాలని, ఈ నిధులతో ఎలాంటి అభివృద్ధి పనులు చేపడితే గ్రామ ప్రజల అవసరాలు తీరుతాయని, ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టేందుకు గ్రామ సభలను నిర్వహించి, పనులను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

బిల్లులు రావడం లేదు..

అభివృద్ధి పనులు చేపట్టి ఏళ్లు గడుస్తున్నా.. బిల్లులు రావడం లేదని, ఇలాగైతే పనులు ఎలా చేస్తామని ముట్పూర్ సర్పంచ్ నర్సింహారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, పింఛన్లు రాకపోవడం వలన సర్పంచులపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని వాపోయారు. ఎంపీడీఓ ఆంజనేయులు స్పందిస్తూ, ఆర్థిక విషయాలకు సంబంధించి ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉందని, పెండింగ్ బిల్లుల విషయం ఉన్నతాధికారుల దృష్టికి నివేదించామని తెలిపారు. అయితే ఉన్న వనరులను వినియోగించుకొని గ్రామాభివృద్ధికి సర్పంచులు కృషిచేయాలని కోరారు. సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీఓ లాలయ్య, ఎంఆర్‌ఐ మహేందర్ గౌడ్, ఏపీఓ నర్సింగ్‌రావు, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



కొందుర్గు: ఎంపీడీఓ, సర్పంచ్ మధ్య వాగ్వాదం

అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

శంకర్‌పల్లి: గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు, కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని శంకర్‌పల్లి ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జీపీ అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని చెప్పారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కార్యదర్శులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని, ఈ ఏడాది జీపీ అభివృద్ధి, ప్రణాళిలను 9అంశాలను ఎంచుకొని, ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కాగా ఈ నెల 18న ప్రతి గ్రామంలో గ్రామసభలను నిర్వహించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోవిందమ్మ, ఎంపీడీవో వెంకయ్యగౌడ్, ఎంపీవో గీత, సూపరిండెంటెంట్ రవీందర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.



మొయినాబాద్ రూరల్: ప్రణాళిక సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీఓ సంధ్య

అభివద్ధి పనులకు అంచనా వేస్తూ..

మొయినాబాద్ రూరల్: ప్రతి సంవత్సరం.. అభివద్ధి ప్రణాళికను ప్రతి జీపీలో నిర్వహించాలని మండల అభివద్ధి అధికారి సంధ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అభివద్ధి ప్రణాళిక 2023–24గాను నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను నమోదు చేస్తూ గ్రామంలో మరిన్ని అభివద్ధి పనులకు అంచనా వేస్తూ ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఈ నెల 17,18 తేదీల్లో గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి అభివద్ధి కార్యక్రమాల ప్రణాళికను రూపొందించాలని చెప్పారు. కాగా.. గ్రామ పంచాయతీ అభివద్ధి ప్రణాళికపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు మెజార్టీ స్థానిక ప్రజాప్రతినిధులు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల అభివృద్ధే లక్ష్యం

కేశంపేట: సబ్బండ వర్గాల అభివృద్ధి బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యం అవుతుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని 53 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేసి మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులందరికీ అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లనమోని రవీందర్ యాదవ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల, తహసీల్దార్ అజీంఅలీ, పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి చేయూత

షాద్‌నగర్‌రూరల్: బుచ్చిగూడ గ్రామానికి చెందిన బోడ జానంపేట అంజయ్య కుటుంబానికి పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి చేయూతనందించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అంజయ్య కుటుంబ సభ్యులు వర్షంలో తడుస్తూ ప్లాస్టిక్ కవర్లు కట్టుకొని మట్టి కుప్పలపై కూర్చున్న విషయాన్ని గమనించిన ట్రస్టు చైర్మన్.. ఆ దళిత కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇచ్చారు. ఈ సందర్భంగా అంజయ్య కుటుంబ సభ్యులు ట్రస్టు అధినేతకు కృతజ్ఞతలు తెలిపారు.



అంజయ్య కుటుంబ సభ్యులతో విష్ణువర్ధన్‌రెడ్డి



చేవెళ్ల: ముగ్గును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

రంగవల్లుల సం'క్రాంతి'

రంగవల్లులు మనదేశ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని, ఇంటి ముంగిట వేసే ముగ్గులు హరివిల్లులను తలపిస్తాయని పలువురు వక్తలు అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు, యువతులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేశారు. అనంతరం నిర్వాహకులు రంగవల్లులను పరిశీలించి, ఎంపిక చేసిన ముగ్గులకు బహుమతులు ప్రదానం చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



షాద్‌నగర్ రూరల్: గార్రెడ్డిగూడలో ముగ్గులను పరిశీలిస్తున్న సర్పంచ్ మాధవి



షాద్‌నగర్ రూరల్: ముగ్గులను పరిశీలిస్తున్న సంస్కారభారతి సభ్యులు

'కార్పొరేటర్‌కు బుద్ధి చెబుతాం'

కందుకూరు: సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, సబితారెడ్డిపై సోషల్ మీడియాలో నిత్యం పోస్టులు పెడుతూ ఇష్టానుసారంగా మాట్లాడుతున్న కార్పొరేటర్ ఆకుల శ్రీవాణికి తగిన బుద్ధి చెప్పడం ఖాయమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏరోజూ కూడా తను ప్రాతినిథ్యం వహిస్తున్న సరూర్‌నగర్ డివిజన్ అభివృద్ధి కోసం పట్టణ పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను కాని, స్థానిక మంత్రి సబితారెడ్డి కాని కలవని శ్రీవాణి వారిపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. తన డివిజన్ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేని ఆమె పెద్ద నాయకుల గురించి మాట్లాడితే, తాను పెద్ద నాయకురాలిని అవుతానని కలలు కంటున్నారన్నారు. ఇదే తరహాలో అసత్య ప్రచారాలు చేస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ సురేష్, సీనియర్ నాయకులు దశరథ, అశోక్, జంగయ్య, మోహన్‌రెడ్డి, తాళ్లకార్తీక్, సామయ్య, బొక్క దీక్షిత్‌రెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి, నవీన్, అలీ, కాసోజు ప్రశాంత్‌చారి, రామకృష్ణ, తేజనాయక్, హనుమంత్, ఉమాకాంత్‌రెడ్డి, నరేష్, నర్సింహ, ప్రభాకర్, షకీల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు